# ప్రపంచ పౌరుడు

శ్రీ కవికొండల వెంకటరావు

అది ధనుర్మాసం. ఇంకా సరిగ్గా చెప్పాస్తే డిశంబరు 26 వ తేదీ. 25 కిసిమిసి పండగ, క్రిస్టియనులకు జరిగిపోయింది. 27 హిందువులకు ముక్కోటి ఏకాదశి రానైయుంది. ఆ కారణంగా డిశంబరు 26 వ తేదీ ఉదయం ఉభయ మతస్థులు కలిసికొన్నప్పుడు, తప్పకుండా, ఆయా మతాలయొక్క తర తమ భేదాలనుగూర్చి నిరూపించుకోవడం ఆయేడు తప్పింది కాదు. అందులోనూ ఆ రెండిళ్లు ప్రక్క ప్రక్క యిళ్లు. ఆయిళ్ళల్లో నివసించేవాళ్లు, ఒకయింట్లో ఒక కన్నె, ఒకయింట్లో ఒక కన్నె. ఆ యిద్దఱికన్నెలను తప్పిస్తే మఱి యొండొరులతో ఈడూ జోడుగా మాటాడుకునే వయస్సు వాళ్ళుగాని, వాలకంవాళ్ళుగాని, యూహానుగలవాళ్లుగాని, మోహానుగలవాళ్లుగాని వేరే లేరనుకోవచ్చు; ఇతరు లెంతమందివుంటేం గనుక ఆ పేటలో!

పేట అంటే ఇతరదేశాల్లో ఏయేకూటమి గల వాళ్లు కలిసి ఒక పేటగా ఏర్పడివుంటారో నాకు తెలియదుగాని, నే వ్రాస్తూవున్న యీ కథలోని పాత్రలు, భారత్యూనియన్‌లోని వార లవడంచేత అందు గల ఊళ్లనుగురించి, పేటల్నిగురించి మాత్రం, నేను భారతీయుణ్ణి కాబట్టి ఎఱుగుదును.

సర్వసాధారణంగా ఏయూరు చూచినా, ఏపట్నం చూచినా, బ్రాహ్మలంతా ఒకచోట, లేదా కోమటిబ్రాహ్మలంతా ఒకచోట, క్షత్రియులు ప్రత్యేకంగా ఒకచోట, కమ్మవారు కాపువారు మరోచోట ఇలా సవర్ణులంతా ఒక గుంపుగా ఉంటే, మరో గుంపుగా అవర్ణులన్న వాళ్లు ఉంటూ వుంటారు. ఈమధ్య ఈ అవర్ణులుండేజాగాను వెలివాడ అని, మాలగూడెం అని పిలవడం మానేసేసి, దేశభక్తుల ధర్మమా అంటూ హరిజనవాడ అనడం సాగిస్తూ వున్నారు. పేరు అంటే మార్చారేకాని, వాళ్ళ ఆర్థికావస్థ, వాళ్ల ఆరోగ్య వ్యవస్థ మార్చగలిగే మహానుభావులు లేనే లేరనవచ్చును. అటువంటి హరిజనవాడలో అక్కడక్కడ క్రిస్టియన్‌లు, తమ స్థిర స్థానానికి, చలనం కలుగకుండా, అనగా వాళ్ల పుట్టుపూర్వోత్రపుటిండ్లు వాకిండ్లు విడిచిపెట్టకుండా, అక్కడక్కడ, సహారాలో ఒయాసిస్సుల్లా, కనబడతారు ఈ క్రిస్టియన్లుకూడా భారత్యూనియన్ ప్రజలే. అసలు భారత్యూనియన్ మతమ్మీద ఆధారపడివున్న దేశం కాదు. లౌకికమైంది. ఆ కారణంగా ఎవరెక్కడ ఏ మతాభిప్రాయంతో విలసిల్లినా వేర్పాటులేకుండా ఏలే స్వభావం ఆ ప్రభుత్వం అలవరుచుకుంది.

ఈ ఉపోద్ఘాతవివరములో అసలు కథ మఱచిపోతానో ఏమో!

నేనన్న ఇద్దఱు కన్నెలు చెఱో ఇంట్లోను ప్రక్క ప్రక్కల్ని కాపురాలు చేస్తూ వున్నారు. కాపురాలుచేస్తూ కన్నెలున్నారు అంటే, వాళ్లెంత ఎత్తు, ఎంత ఏపుగలిగివున్నవాళ్ళో వర్ణించడ మనవసరం. అయినా కొద్దిగా చెప్తాను, ఎందుకైనా మంచిది.—ఎవరిసంపాదన వారు చేసుకుంటూ, ఎవరి పొయ్యి వారు రాజేసుకొంటూ, ఎవరి పక్క వాళ్లు వేసికో గల స్వతంత్రత గల వాళ్లు ఇద్దఱూ కూడాను. హరిజనకన్య పేరు "కువలయార్ద్రి" క్రిస్టియన్ కన్య పేరు "రెబక్కమ్మ"

కన్యల యిద్దఱియిళ్లకు మధ్య, పురాతనకాలం నుంచి పెరుగుతూ తఱుగని ఒకానొక కట్టవ వుంది. ఆదిలో ఆపేట ఒక పొలం కావడంవల్ల, ఆ పొలం యొక్క రెండుమళ్ళకు మధ్య పోసిన ఒకానొక మందడిగట్టే ఆ రెండిళ్లకు సరిహద్దుఅయి, దానిమీద పడి మొలిచిన ప్రతీ మొలకను ఎదగనివ్వడంచేతను పెద్ద కట్టవగా తేలింది. తొల్త పూర్వీకు లొకరొకరికి, గట్టుమీద మొలిచిన చెట్లు పందులమ్మట కనబడుతూవచ్చినా, క్రమక్రమంగా రొట్టాపట్టా బలిసిపోయి, యీతరంవారి నొండొరులు చూచుకోకుండా చేసి పారేసింది. ఏదైనా ఒకరితో వొకరికి తమలో తమకు కువలయార్ద్రికు రెబెక్కమ్మకు చెప్పుకోవాలని వుంటే తమతమ వీధి గుమ్మాలు వెలువడి ఒకరి తలుపు ఒకరు తట్టుకోవలసిందే! అందులోనూ ఒకళ్లు కిరస్తానీవాళ్ళు అని, మఱొకళ్లు అరుంధతీయులని అనుకొంటూ వున్నంతసేపు వారిరువురిమధ్య అన్యోన్యత ఇంతలో ఏర్పాటు కాగలదని పాఠకు లనుకోవడం పట్టే.

కువలయార్ద్రిజీవితానికి రెబక్కమ్మ జీవితానికి పోలికే లేదు. ఏనాడో ఆ పేటంతా అంటుకుని, అందున్న ఇళ్లన్నీ తాటాకు ఇళ్లు కావడంచేతను, సమస్తం పరశురామప్రీతి అయినప్పుడు, వీళ్ళ పూర్వీకులు వాళ్ళ పూర్వీకులు కలిసి నీళ్ళుతోసి, పోసి, ఆర్పుకొని ఆరుబయట అన్యోన్యత్వం అనుసయించుకున్నారో, మఱి ఎన్నుకున్నది లేదు; మన్నించుకున్నది లేదు. అప్పటికి ఇప్పటికి కులవృత్తి మాను

కోకుండా కువలయార్ద్రి కోతలకెళ్ళి, ఊడుపులూడ్చి, పచ్చగడ్డిమోపులెత్తుకుని విచ్చలవిడి మచ్చికతో పెరిగింది. రెబక్కమ్మ స్కూలు ఫైనల్ దాకా చదువుకుని, ఫెయిలింగు అయి, ఒక మిస్ట్రెస్సుగా పని చేస్తూ, పృచ్ఛిస్తేనే గాని జవాబు చెప్పని బిగువుతో ఎదిగింది.

రూపానికి మళ్లీ ఇద్దఱూ ఒకటే! గబ్బితనంలోనూ, గుబ్బతనంలోనూ, నిబ్బరంలోను, అబ్బురంలోను సరిసమానులు. అయితే చీరకట్టు, చెంగువిసరు, సిగచుట్టు, ముంగుగుసుసురు, ఇలాంటివాటిల్లో వేర్పాటు ఎవరికివారే అన్నట్టు కాపరిచేరు. ముఖ్యంగా వీథమ్మట వెళ్ళేటప్పుడు కువలయార్ద్రి చేతిలో నిడుపాటి వడపలు, రెబక్కమ్మ చేతిలో కులుచ గొడుగు, ఎవరి అందము వారిదే ఎవరి చందము వారిదే అని రూఢి గొల్పేవి. దానాదీనా ఒకగు ఒక యింట్లోకి, ఒకరు ఒకయింట్లోకి వేటే వేటే ప్రవేశించడంకూడా పాంథజనులకు ఆనవాలై పోయింది.

ఒక పాంథజనుడు కువలయార్ద్రియిల్లు చూపించి, "ఈయింట్లో ఎవరు వున్నారోగాని వారివల్ల మన దేశములోని తిండి సమస్య పరిష్కారమయ్యేని" అంటే, వేఱొక పాంథజనుడు రెబక్కమ్మ యిలు చూపించి ఈ యింటివారి జీవితపు కొలమానముతో సమానమైన కొలమానం మరెందునూ కానం" అనేవాడు. నాకు మాటలయొక్క అర్థం తెలియకపోయినా ఆ మాటలు విన్నప్పుడల్లా, రెండు గోచరించేవి. ఒకటి — కువలయార్ద్రియొక్క నలుచతురపు మూర ముంగిట్లోను ఇట్టలంగా ఎదిగి ఇంపుగాపూసి సొంపుగా కాస్తూవున్న చిక్కుడుపాదు కనిపించేది రెండు— రెబక్కమ్మ బెత్తెడువాకిట్లోను, సీతాకోక చిలుకలు వాలినట్లు అగపించే రంగురంగుల క్రోటను మొక్కలు గల కుండీలుండేవి. ఆ పాదంత విస్తరింపుగా ప్రాకి అంత విరివిగా ఎలా కాసేనో మనయింట్లో పాదెడితే మాడిపోతుంది అని ఒకడనుకుంటే, ఆ కుండీలోకి ఏరకం ఏయేతమెుంచేనో, పెంటయెత్తి ఆపె, తానెంత సేవచేసినా తాతలేవలేదే మొక్కకు అని మఱొకడు మిడుకుతూ మిడుకుతూ చూసేడు!

ఆలా తమకేసి చూచేవాళ్లను ఆ కన్నెలున్ను, జాలకంబులగుండా చూచినట్లు తమ కన్నులరవాల్చి చెప్పలంట జూచేవారు. ఊ, ఇదయ్యేవారు తమర్ని ఆ పాంథజనుల్లో ఒక్కడైనా పెళ్లాడకపోతాడా అని. —చూడ్డం అంటే సులువుగాని పెళ్లి చేసికోవడం అనేది ఏదేశంలోనూ కష్టమే. అందులోనూ భారత దేశంలో మఱీ కష్టము. ఇప్పటికే జనసంఖ్య మితి మీఱి వుంది. ఇంకా స్త్రీ పురుషాదులు వివాహమై శిశువుల్నికంటే, వాళ్లందఱినీ మేపి, సాపుచేసి, చక్కపఱచి, సంపల్లలితమైన సరఫరా ఏ సర్కారు చేయగలదు?

ఇదంతా నిత్యం వార్తాపత్రికల్లో కూలంకషంగా చెఱగబడ్డం కన్నె లిద్దఱికీ తెలుసును. ప్రతీయువకునికీ తెలుసును. తత్రాపి ఇద్దఱుకన్నెలూ కూడా తాము స్వార్జితంగా కొంత డబ్బు అనగా అధమం ఒక్కొక్క రొక్కొక పదివేల రూపాయలైనా కొతాలో నిలవవేసికొందే పెళ్లాడరాదనికూడ బలుకున్నట్లు ఆలాగే వుండిపోయేరు, ఏలాంటి మనువూ లేకుండా.

ఏళ్ళు జరిగిపోజొచ్చాయి. గోవాళ్ళు ఆయింటికీ ఈయింటికీకూడా వచ్చి నిరాశాపరులై పోతూ వుండేవారు. ఇలా వుంటూవుండగా ఓ ధనుర్మాసంలో వచ్చిన డిశంబరు 25 వ తేదీ రాత్రి ఏంజరిగిందీ అంటే-రెబక్కమ్మ ప్రతీ క్రిస్టమస్ పండక్కీ నిలిపినట్టే ఒక కిసిమిసిచెట్టు ప్రాంగణంలో ఎత్తుగా నిలిపింది. పరపుగా కొమ్మలు రెమ్మలు, అమరిచి, బొమ్మలూ షామ్మలు కుదిరిచి, కిసిమిసి తాతకోసం వేచివుంది. బైబిలులో ఏసుజననం అన్న దాన్ని గురించి చదువుతా వుంది. అదేవేళకు కువలయార్ద్రి తన వాకిట్లో కళ్లాపు చల్లి, వరిపిండితో రథం, నాగుబాము, పద్మం, ఇలాంటి ముగ్గులు పచరించుకు వెన్నెల్లో సందర్శిస్తూ, తన కులవేల్పైన 'కొంతి' ని సంస్మరించుకుంటూ వుంది ఇద్దఱూ అప్రయత్నంగా ఒకేసారి కునుకు గన్నారో ఏమో,—కల్లో—ఇద్దఱూ ఒకేసారి మెలకువ వచ్చేలా, ఆ రెండిళ్ళకు మధ్యనవున్న కట్టవలో చంటిపిల్లవానియొక్క "కేరు కేరు" ఏడ్పు వినబడ్డట్టయింది.

వెంటనే ఈతట్టునుంచి ఒక ఎండు తాటాకు అంటించుకుని కువలయార్ద్రి తనవైపు కట్టవమ్మట నెరుకసాగింది. ఆతట్టునుంచి రెబక్కమ్మ ఒక టార్చి వేసుకు చూడసాగింది. కాని ఒకరి వెలుగు ఒకరికి కానబడ్డంలేదు. అంత దట్టంగా అల్లుకుపోయి అదంతా అంధకార మయమయి వుంది. రెండెంపులా వెలుఁగు ప్రసరించినా ఆ వెలుగు.

ఇరువురూ క్రమంగా కట్టవచివరకువచ్చి నిలబడిపోతూ, ఒకరిమీదకు ఒకరు తమతమ దివ్వలను వేసుకున్నవారై విస్తుపోయి, "మనిద్దఱికూ ఈపొద్దు

ఒకేరకపు కలవచ్చినట్లుందే! మనిద్దఱం ఒకే రకం ధ్వనివిని లేచినట్లున్నామే! కాని కట్టవలో ఏమీ కనిపించదే!" అని అనుకొన్నారు. "ఏమిటా వెన్నెట్లోను ముంగిట్లో కొత్తచెట్టు?" అని అడిగింది కువలయార్ద్రి. "అదే మా కిసిమిసి మహావృక్షము. అయితే ఎందుకు? దాన్నప్పుడే నీ చిక్కుడుపాదలముకు పొయ్యేని" అంది రెబక్కమ్మ. "నే నిప్పుడు పెట్టానో లేదో ముగ్గు, నీ ఎఱ్ఱచీమలు చూడు అప్పుడే వచ్చి ఎలా తినేస్తున్నాయో పిండిఅంతా" అంది కువలయార్ద్రి.

"ఏమిటా ముగ్గు? ఎందుకు పెట్టేవు?" అని అడిగింది రెబక్కమ్మ కువలయార్ద్రిని. అడిగితే "మేం, హరిజనులమన్న మాట తెలుసా? మాది హిందూమతమని ఎరుగుదువా?—ఆ మతాన్ని అనుసరించి ధనుర్మాసం ఆరంభంనుంచి, రాత్రిళ్ళు కళ్ళాపుచల్లి పిండిముగ్గులు పెట్టుకుంటాము! అది మా మతం!' అంది కువలయార్ద్రి. "ఎవరు చెప్పేరు నీ కిదంతా?" అని అడిగింది రెబక్కమ్మ. మా మాల పురోహితుడు చెప్పేడు. మఱీన్నీ నిత్యం మా కుల వేలైన కుంతి కథ చెబుతూ, కర్ణుని జన్మవృత్తాంతం దగ్గఱ కొచ్చేసరికి ఆపేస్తూ—వెలుగు చూడు! సూర్యోదయంచూచి నమస్కరించు అని బోధచేసి తెల్లఱకుండా తాను తిరోహితు డయ్యేడు" అంది అతి అమాయకంగా. రెబక్కమ్మకూడా తన మనసు తేట తెల్లమయ్యేలా ఎఱుకపఱిచింది; తనచిన్నప్పటప్పుట దైవజ్ఞాన గురువువచ్చి దేవుని వేదగ్రంథాన్ని బోధపఱచి, అందులోని క్రీస్తు జననఘట్టం వినిపించేసేని, వినిపించి వినిపించి దీపమార్పేసి చూడు ఇలా చీకటిమయంగా వున్నప్పుడు మేరీ కన్య పశువులకొట్టంలో క్రీస్తుని కన్నదని వివరించి తిరిగి దీపం ముట్టించేడని.—అయితే మీ మతం చీకటినుండా వెలుతురులోకి తీసుకువెడుతుంది కాబోసు. మా మతం ఎప్పుడూ వెలుతురు మయమేను. అసలు కర్ణుడు పుట్టిందే వే వెలుగులవానికి. మఱి చాటూలేదు, మాటూకాదు." అంది కువలయార్ద్రి. "ఏమైతేం! మీ మతంలోను ఒక కన్య, ఆ కన్యకు ఒక కొడుకు కలగడం! ఇలాంటి గాధ వుంది!" అంది రెబక్కమ్మ.—"ఏ మతంలోనైనా వెఱ్ఱితొఱ్ఱి గాధలుండక మానవు. ఇప్పుడు మనకు కట్టవలో వినబడ్డ బిడ్డ ఏడ్పులాంటివే ఆ గాధలు" అంది కువలయార్ద్రి. దానిమీద 'రెబక్కమ్మకు మఱోసారి కట్టవఅంతా వెనుకి చూద్దామని బుద్ధిపుట్టింది. తనకు తోడు కువలయార్ద్రిను రమ్మనమంది. నిజం తెలుసుకుందామంది. మనిద్దఱకూ ఒకేలాంటి కల రావడం ఒకేచోట ఏడుపు వినబడ్డం అత్యంతకరం ఆశ్చర్యమే" నంది. రెబక్కమ్మయొక్క వాగ్ధారకు లొంగిపోయినట్టుగా కువలయార్ద్రి ఆమె వెంట వెంట కట్టవింకో పాలి వెదకజొచ్చింది. కారుమనడం మానేసి ఈమాటా శిశువు చిఱునవ్వు నవ్వినట్టు అయింది. కాని రూపం ఏమీ కాపడదాయిరి.

చటుక్కన ఒకచోట కొత్తగా అప్పటికప్పుడు చంకక్రలమీద నిలబడ్డట్టు, నిలబడి పొడుగ్గా ఒక దైవికత్వం మానవత్వం కలసిన మహాదృశ్యం సాక్షాత్కరించి ఆ యిరువురకూ ఇలా ప్రబోధించింది. "నేనొక కుంటిదాన్ని, నాకొక శిశువు ఈ కట్టవలో కలిగాడు. వీణ్ణి మీ యిరువురకు ఒప్పజెప్పి నేను సెలవు పుచ్చుకొంటూవున్నాను. నేను కిసిమిసి ముక్కా ముసిలితాతనూ కాను: అనూరుణ్ణీ కాను. నేను నేనే ఆడదాన్ని." అని దివ్యజ్యోతి అయి తిరోహిత అయింది.

"కల కాదు నిజంగా బిడ్డే! ఆ బిడ్డను కన్నది ఒక దేవత" అని కువలయార్ద్రి రెబక్కమ్మకూడా ఏకధాటేని నమ్మారు. ఒకే త్రాటిమీద నిలిచేరు బిడ్డను గురించి యోజించేటప్పుడు. కాని దేవతను గురించి ఆలోచనలో పడ్డప్పుడు మాత్రం ఆ దేవతకు ఎడం కాలు మాత్రమే కుంటి అని రెబక్కమ్మ, కుడికాలు మాత్రమే కుంటి అని కువలయార్ద్రి తగవుపడసాగారు. కట్టవలో బిడ్డకు నవ్వుమాని కెవ్వుమాని సెలవు లంట తెల్లని చనుబాలు నెలలించేడు.

తెల్లాఱింది, సమస్తం లోకానికి వెల్లడైఅయింది. "మీర నే దేవత కే కాలుకుంటెఅని మీరిద్దఱూ తగవుపడేకన్న, ఏ కుంటీలేని యీ కూచినిచూచి సంతోషించండి!" అని యిరువురకు ప్రబోధంచేసేరు పట్నంలోని ప్రజఅంతా.

నాటినుండీ రెబక్కమ్మ, కువలయార్ద్రి, మతం అన్నది మఱచి కట్టవకొట్టిపారేసేసి, ఏకండీ యిల్లుగా రెండిళ్ళూ గావించుకుని ఆ దొఱకిన బిడ్డణ్ణి దైవదత్తంగా చేకొని యిరువురూ కలిసి పెంచి పెద్దవాణ్ణి చేశారు. అతగాడు క్రమక్రమంగా శుక్లపక్ష చంద్రుడిలా పెరిగి ప్రపంచ పౌరుడయ్యేడు.

కథ కంచెకు వెళ్ళింది. మనం మనయింటికి వెళ్ళేం.